పైపులైన్ల పనులు వేగవంతం

- శారదాకాలనీలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- ప్రతిరోజూ క్లోరినేషన్ శాతం పరిశీలన
- నగర కమిషనర్ కీర్తి చేకూరి



పైప్‌లైన్లు షిఫ్ట్ చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

నెహ్రూనగర్: గుంటూరు నగర సమగ్రాభివృద్ధిలో భాగంగా శారదాకాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణ పనుల వలన కొన్నిప్రాంతాల్లో ఉత్పన్నమైన తాగునీటి పాత పైప్‌లైన్‌ల మరమ్మతులు, డ్రైన్‌ల పక్కన ఉన్న పైప్‌లైన్లు, నీటి కుళాయిలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ, పాత జీఐ పైప్‌ల స్థానంలో నూతన పైప్‌లైన్‌ల ఏర్పాటు జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం శారదాకాలనిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పైప్‌లైన్ మరమ్మతులను కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్ఈ క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

రూ.4.03కోట్లతో నూతన డ్రైన్లు, రోడ్లు..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శారదకాలనీలో ప్రస్తుతం రూ.4.03 కోట్ల అంచనాలతో నూతన సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, పనులు చేపడుతున్న క్రమంలో కొన్నిలైన్లలో ఉత్పన్నమైన తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందన్నారు. కాలనీలోని ప్రతిలైన్‌కు ప్రత్యేకంగా ఇంజినీరింగ్ సిబ్బందిని, పనుల పర్యవేక్షణకు ఏఈలు, డీఈఈలకు విధులు కేటాయించామని తెలిపారు. ఎక్కడైనా అనారోగ్య సమస్యలు గుర్తిస్తే వారి ఇంటికి వచ్చే తాగునీటి పైప్‌లైన్‌లను పూర్తిగా మార్చి నూతన లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాత జీఐ పైప్‌లైన్లు, డ్రైన్లకు సమాంతరంగా ఉన్న పైప్‌లైన్‌లను యుద్ధప్రాతిపదికన మార్చడం జరుగుతుందన్నారు. 24 ఇళ్ల తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు చేశామని, 231 డబుల్ ట్యాప్‌లను డమ్మీ చేయడం జరిగిందని తెలిపారు. ఎమినిటీ కార్యదర్శుల ద్వారా ఉదయం, సాయంత్రం సుమారు 1040 క్లోరిన్ శాంపిల్స్ తీస్తున్నామని, అందులో క్లోరిన్ తగిన మోతాదులోనే ఉన్నట్లు తెలిపారు. డ్రైన్‌కు సమాంతరంగా ఉన్న 88 ట్యాప్‌ల్లో 74 ట్యాప్‌లను షిఫ్ట్ చేశామని తెలిపారు.

రిజర్వాయర్లు ఎప్పటికప్పుడు శుభ్రం..

ఇప్పటికే నగరంలోని 45 రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేస్తున్నామని, శుభ్రం చేసిన తేదీ, తర్వాత చేసే తేదీలను రిజర్వాయర్ దగ్గర బోర్డ్ పై రికార్డ్ చేయడం జరుగుతుందని తెలిపారు. రిజర్వాయర్ల వద్ద ఏర్పాటు చేసిన క్లోరిన్ ప్లాంట్‌ల ద్వారా తాగునీటిలో తప్పనిసరిగా 2 పీపీఎం క్లోరిన్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో నగరానికి వేసవిలో తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వాన్ని పులిచింతల నుంచి నీటిని విడుదల చేయాలని కోరగా వచ్చిన నీటిలో టర్బిటీ అధికంగా ఉందని, ప్రజలు కొంత కాలం నీటిని కాచి చల్లార్చి తాగాలని పత్రికా ముఖంగా గత నెల 27న తెలియచేశామని తెలిపారు. గుంటూరు నగరానికి మెరుగైన, అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు అమృత్ పథకం కింద ప్రభుత్వం రూ.183 కోట్లకు అనుమతులు మంజూరు చేసిందని త్వరలో ఉండవల్లి నుంచి గుంటూరు వరకు, సంగంజాగర్లమూడి నుంచి గుంటూరుకు రెండో పైప్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం, శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత ఓంకారక్షేత్రం కార్యదర్శి నంబూరు వెంకట శ్రీమన్నారాయణమూర్తి ఆధ్వర్యంలో శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, సంఘ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా గురువారం నిత్యపూజలు, పారాయణాలు అనంతరం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ఋత్వికుల వేదమంత్రాల నడుమ కనుల పండువగా జరిగింది. విశేష హారతి మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. భక్తులు విశేషంగా పాల్గొని కల్యాణ మూర్తులను సేవించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం స్వరరాగ సుధ వారి భక్తి సంగీతం భక్తులను ఆకట్టుకుంది.

చలమయ్య విద్యార్థుల రక్తదానం



గుంటూరు ఎడ్యుకేషన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితునికి అత్యవసరంగా రక్తం అందించి ప్రాణాలు కాపాడిన గుంటూరు చలమయ్య–కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులను కరస్పాండెంట్ కర్నూరపు రామకృష్ణప్రభు అభినందించారు. సంగడిగుంటలోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స చేస్తున్న బాధితునికి రక్తం కావాలని బుధవారం సమాచారం అందుకున్న కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎ.శ్రీధర్ సూచన మేరకు డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులు హర్షిత్, నాగసాయి తక్షణమే స్పందించి రక్తదానం చేశారని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి, ఇందిర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడంలో వలంటీర్ల సేవలు ఎంతో అమూల్యమైనవని వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు గుండ్లమడుగు శాంతమూర్తి గురువారం ఓప్రకటనలో తెలిపారు. వలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులతో వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అవినీతికి తావులేని విధంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ, వారి ఇంటికే వెళ్లి దరఖాస్తు చేయించడంలో వలంటీర్లు ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్–19 సమయంలో వారు అందించిన సేవలు మరువలేనివన్నారు.

సరస్వతి శిశు మందిర్‌కు కంప్యూటర్ బహూకరణ



గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరులోని శ్రీసరస్వతి శిశు మందిర్‌కు టీజేపీఎస్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కె.రాధాకృష్ణమూర్తి, శ్రీసరస్వతి విద్యాపీఠం ఉపాధ్యక్షురాలు రాధాబాయి దంపతులు కంప్యూటర్ బహూకరించారు. గురువారం శిశుమందిర్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి సాధించేందుకు కంప్యూటర్ ద్వారా విద్య నేర్పాల్సిన అవసరముందన్నారు. పాఠశాల హెచ్ఎం కె.పద్మజ, కొల్లా రుచి (యూఎస్ఏ), పాఠశాల సంయుక్త కార్యదర్శి కె.రామ్మోహనరావు, పలకలూరు శివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యుడి ఇంట్లో చోరీ

రూ.2లక్షల నగదు, 60గ్రాముల బంగారం మాయం

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్యామలానగర్ 3వలైనులో డాక్టర్ పద్మనాభరావు కుటుంబం నివాసం ఉంటున్నారు. వారం రోజుల క్రితం డాక్టర్ పద్మనాభరావు కుటుం ఇంటికి తాళాలు వేసి ఖమ్మం వెళ్లారు. గురువారం ఉదయం ఇంటి కిటికి పగులగొట్టి ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రూ.2 లక్షల నగదు, 60 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, వైష్ణవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాబోధనతో పాటు ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. కళాశాలలో విద్యను అభ్యసిస్తూ, వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలను పొందిన విద్యార్థులకు గురువారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్వీ రమణ మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా పలు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారందరు ఏడాదికి రూ.3.5 లక్షల నుంచి ఐదు లక్షల వరకు ప్యాకేజీ పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, ప్లేస్‌మెంట్ అధికారి చల్లా వైష్ణవి, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డి.కల్యాణి, ఎ.బాజీబాబు, సీహెచ్ వేదవతి, ఎస్.మణికంఠ, డాక్టర్ ఎస్.గోపి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో ప్రతిభ చూపిన విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న జూపూడి రంగరాజు, నాగభూషణం

గుంటూరు ఎడ్యుకేషన్: ఔషధ రంగంపై జాతీయస్థాయిలో నిర్వహించిన సదస్సులో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థిని ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. గురువారం అమరావతిరోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నాగభూషణం మాట్లాడుతూ ఈనెల 12న నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, యూఎస్ఏకు చెందిన కేటలిస్ట్ హెల్త్‌కేర్–లైఫ్ సైన్సెస్ సంయుక్తంగా 'రీసెంట్ అడ్వాన్సెస్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ డ్రగ్ డిస్కవరీ టు డ్రగ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ స్టేజ్స్' సదస్సులో పాల్గొని పోస్టర్ ప్రజెంటేషన్ సమర్పించిన ఫార్మా.డీ నాలుగో సంవత్సర విద్యార్థిని పి.లిఖిత గాయత్రి తృతీయ బహుమతి పొందినట్లు వివరించారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఫార్మా.డీ డైరెక్టర్ పి.సీతారామయ్య, ఎస్.హేమకుమారి విద్యార్థిని లిఖిత గాయత్రిని అభినందించారు.

కష్టపడే ప్రతిఒక్కరికీ సముచిత స్థానం

ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్సార్ సీపీ ఈస్ట్ సమన్వయకర్త నూరి ఫాతిమా



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నూరి ఫాతిమా

నెహ్రూ నగర్: పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా పేర్కొన్నారు. 11వ డివిజన్ కార్పొరేటర్ ఆబిద్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నూరి ఫాతిమా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్రంలోని ప్రతి పేదవాడి పార్టీ అని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడే, ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని, ప్రతీ ఒక్కరికీ సమన్యాయం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ ముఖ్య నేతలు కర్నూమా, తోట ఆంజనేయులు, వాక శ్రీనివాస రెడ్డి, మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి, బుజ్జి, గౌస్, పల్లపు మహేష్, హిదాయితుల్లా, ఎర్రబాబు మహిళా నాయకులు పాల్గొన్నారు.

నగరంలో ఇంటింటి వైద్య సర్వే

గుంటూరు మెడికల్: నిరంతరం వైద్య సేవల్లో భాగంగా స్థానిక శారదా కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, లాంచెస్టర్ ప్రాంతంలో ఏడు ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గురువారం తెలిపారు. అతిసార వ్యాధి నివారణ, నియంత్రణలో భాగంగా రౌండ్ ది క్లాక్ ప్రాతిపదికన నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శారదా కాలనీలో 3 వైద్య శిబిరాలు, ఇందిరా ప్రియదర్శి కాలనీలో 2, లాంచెస్టర్ పరిధిలో 2 వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 35 వైద్య బృందాలతో ఇంటింటి సర్వే నిర్వహించామన్నారు. 10,813 గృహాలు సందర్శించి, 1380 ఓఆర్ఎస్ ప్యాకెట్స్, 196 జింక్ మాత్రలు, వ్యాధికి కారణాలు, వ్యాధి లక్షణాలు, చికిత్స నివారణపై అవగాహన కలిస్తూ కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 26 మంది అనుమానిత అతిసార బాధితులను గుర్తించి అందులో 10 మందికి ఇంటి వద్దనే చికిత్స అందించినట్లు వెల్లడించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, తాజా ఆహార పదార్థాలు మాత్రమే భుజించాలని ప్రజలకు వివరించారు. నిలువ ఉన్న, కుళ్లిన ఆహార పదార్థాలు పండ్లు తీసుకోరాదని ఇంటింటా సర్వే చేసినప్పుడు ప్రజలను చైతన్య పరిచినట్లు తెలిపారు. వైద్య సహాయం కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 8341396104, 7207595104 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలని డాక్టర్ కె.కొర్రా విజయలక్ష్మి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి



పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న స్రవంతి

పొన్నూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర పర్యావరణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణతో కూడిన విద్య అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్నటువంటి విపరీతమైన మార్పుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేయటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ప్రతి విద్యార్థికి మొక్కలు పెంచివలసిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు శోభాచంద్, శ్రీనివాసరెడ్డి, గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త షేక్ గౌసుల్ మీరా, జిల్లా సైన్స్ అధికారి ఎ.రవికుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, శివకుమార్, పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



ప్రభుత్వ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న డీటీఓ రాజగోపాలరావు, చాంద్‌బాషా

గుంటూరు వెస్ట్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీ కమ్ హ్యాండ్ బుక్–2024ను జిల్లా ట్రెజరీ శాఖాధికారి బి.రాజగోపాలరావు, సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా ఆవిష్కరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో చాంద్‌బాషా మాట్లాడుతూ ఈ డైరీలో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన వెబ్‌సైట్ అడ్రస్‌లు, పెన్షన్, జీతభత్యాల రూల్స్, కొత్త పీఆర్సీ, డీఏ, ఫండమెంటల్ రూల్స్ తదితర అంశాలను పొందుపరచామన్నారు. ఇది ఉద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఇతరులపై ఆధారపడకుండా అన్ని విషయాలు తెలుసుకునే సౌలభ్యం ఇందులో ఉందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కేవీఎస్ శివారెడ్డి, పోతురాజు, కరిముల్లా షాఖాదరి, నాగేశ్వరరావు, హేమలత, అనిత తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ



పట్నంబజారు: ఆర్టీఏ అధికారుల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పలు ముఖ్య ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇన్సూరెన్సు లేకుండా తిరుగుతున్న మోటారు వాహనాలపై కొరడా ఝుళిపించారు. జేకేసీ కాలేజీ రోడ్డు, గుజ్జనగుండ్లతోపాటు పలు ప్రధాన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఇన్సూరెన్సు లేని 55 ద్విచక్రవాహనాలపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.గోపాల్, సౌజన్య, రాఘవరావు, విజయసారథి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

యనమదల (ప్రత్తిపాడు): మండల పరిధిలోని యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్, నేత్రాలయ ఐకేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ షేక్ సైదా, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకోటయ్య, కళాశాల డైరెక్టర్ గోగినేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కొత్తపుస్తకాలు

కాకుమాను: విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు స్థానిక శాఖా గ్రంథాయల అధికారి జోగి మోహనరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఆరు నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీషు మీడియం చదివే విద్యార్థులకు పుస్తకాలు జిల్లా గ్రంథాయలం నుంచి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి చదుకోవాలని సూచించారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి



చైర్మన్‌ను సన్మానిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా ఏటుకూరుకు చెందిన ఆళ్ళ రవిదేవరాజు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని జేడీఏ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో జిల్లా అగ్రిటెక్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు నూతన చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌ను కమిటీ సభ్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన చైర్మన్ మాట్లాడుతూ 19 మందితో కూడిన నూతన కమిటీ నియామకం జరిగిందని చెప్పారు. ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు, డైరెక్టర్ బొల్లెద్దుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపుదలకు పార్కులు దోహదం



పార్కును ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు

- నగరంలో ఉద్యానవనాల అభివృద్ధికి చర్యలు
- మంత్రి విడదల రజిని
- పోస్టల్ కాలనీలో పార్కు ప్రారంభం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం పెంపునకు పలు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. గురువారం నగరంలోని 49వ డివిజన్ పోస్టల్ కాలనీలో రూ.25 లక్షలతో నగర పాలక సంస్థ అభివృద్ధి చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పోస్టల్ కాలనీ పార్క్‌ను ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపునకు, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్థానిక ప్రజలు ఉండేలా పార్కులను ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 49వ డివిజన్ పోస్టల్ కాలనీలో రూ.25 లక్షలతో పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ఆట వస్తువులు, గ్రీనరీ ఇంకా ఇతర అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. పార్కులను స్థానికులకు ఎంతగానో ఉపయోగపడేలా, ఆహ్లాదం, ఆరోగ్యం అందించేలా అభివద్ధి చేశామన్నారు. ఇప్పటికే నగరంలోని అనేక పార్కులను ఆధునిక హంగులతో అభివృద్ధి చేశామని, ముఖ్యంగా గాంధీ పార్కును అభివృద్ధి చేశామని తెలియచేశారు. పార్కుల అభివృద్ధితో పాటు నగరంలో అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముందుగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, పార్క్ ప్రధాన ద్వారాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బోడపాటి ఉషారాణి, అందుగుల సంతోష్, జిల్లా గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ బత్తుల దేవానంద్, వైఎస్సార్ సీపీ నాయకులు కిషోర్ కుమార్, బోగిసం ప్రసాద్, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సీటీస్కాన్ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకులకిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రి రేడియాలజీ విభాగంలో సిటీస్కాన్ పరికరం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతుల బడ్జెట్ కింద రూ.5 కోట్లు కేటాయించారన్నారు. అందులో భాగంగా సీటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు రూ.4 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు జీజీహెచ్‌కు రెండో సీటీ స్కాన్ పరికరం అవసరమని భావించి బడ్జెట్ విడుదల చేశారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎం.టి.కృష్ణబాబు, ఏపీ ఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో రేడియాలజీ విభాగాన్ని అద్భుతంగా తీర్చదిద్దబోతున్నట్లు వెల్లడించారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని, ఏపీఎంఎస్ ఐడీసీ ఏఈ రత్తయ్య, పలువురు ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపోటముల కంటే ప్రయత్నం ప్రధానం



సీఏ శశిభూషణ్

గుంటూరు ఎడ్యుకేషన్: గెలుపోటముల కంటే పోటీలో పాల్గొనాలనే ప్రయత్నం చేయడం ప్రధానమని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ జీఎస్‌వీ శశిభూషణ్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో గురువారం ఏఎన్‌యూ అంతర్ కళాశాలల వాణిజ్య శాస్త్ర క్విజ్ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శశిభూషణ్ మాట్లాడుతూ విద్యార్థుల మనోవికాసానికి క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌ను అభివృద్ధి పరచుకోవడం ద్వారా పోటీ పరీక్షల్లో నెగ్గే సామర్థ్యం ఏర్పడుతుందని చెప్పారు. గెలిచినా, ఓడినా ప్రయత్నం అనేది ముఖ్యమని, ప్రయత్నంలో వేసే మొదటి అడుగు విజయానికి ప్రేరణ కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా వివిధ కళాశాలల నుంచి 35 టీంలు పోటీ పడగా, తొలి రెండుస్థానాల్లో విజేతలుగా నిలిచిన జేకేసీ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల టీంలకు వరుసగా రూ.2వేలు, రూ.1,500 చొప్పున నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. అదేవిధంగా పాల్గొన్న ప్రతి టీంకు ప్రశంసా పత్రాలు ఇచ్చారు. డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఏబీపీ మనోహర్, ఎస్.అనితాదేవి, క్విజ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు జి.సురేష్ కుమార్, చంద్రశేఖర్, నాగ నిర్మల, జేవీ సుధీర్ కుమార్, కె.శాస్త్రి, నాగలక్ష్మి, షహీనా బేగం, సీహెచ్ మణి, వరలక్ష్మి, సంగీత, శ్రీలత పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన బాధితుల సంఖ్య

గుంటూరు మెడికల్: వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఇప్పటివరకు మొత్తం 183 మంది జీజీహెచ్‌లో చికిత్స పొందారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. వారిలో 99 మంది డిశ్చార్చి కాగా, ప్రస్తుతం 84 మంది చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. చికిత్స పొందుతున్న వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. ఇద్దరు వయో వృద్ధుల పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉందని, వారికి సూపర్ స్పెషాలిటీ వైద్యుల పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. గత రాత్రి నుంచి ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు చెప్పారు. గత రాత్రి ఏడుగురు, గురువారం పదిమంది మాత్రమే చికిత్స కోసం వచ్చినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డిల పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి పనిచేస్తున్నారన్నారు. రోగులకు అన్ని రకాల మందులు, డయాలసిస్ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు.

మాదిరి పాఠ్యాంశాల బోధనపై దృష్టి పెట్టండి

చినలింగాయపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మాదిరి పాఠ్యాంశ బోధన చేపట్టాలని ఎంఈవో కేఎఫ్.కెనడీ సూచించారు. మండలంలోని చినలింగాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సూచించారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 విజయ్ భాస్కర్, ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com